# నమస్తే తెలంగాణ
# హైదరాబాద్
హైదరాబాద్- మేడ్చల్

I | హైదరాబాద్, సోమవారం 29 ఏప్రిల్ 2024 | HYDERABAD


## ఎయిర్‌పోర్టులో చిరుత



శంషాబాద్ రూరల్: శంషాబాద్ ఎయిర్‌పోర్టులో చిరుత సంచారం కలకలం రేపింది. విమానాశ్రయం ప్రహరీ లోపలి భాగంలో ఆదివారం తెల్లవారుజామున చిరుత కదలికలు సీసీ కెమెరాల్లో రికార్డు అయ్యాయి. అప్రమత్తమైన ఎయిర్‌పోర్టు, అటవీ శాఖ అధికారులు చిరుత కోసం గాలింపు చేపట్టారు. చుట్టు పక్కల గ్రామాల ప్రజలతో పాటు ఎయిర్‌పోర్టు సిబ్బంది జాగ్రత్తగా ఉండాలని ఆర్‌జీఐఏ పోలీసులు సూచించారు. చిరుతను పట్టుకునేందుకు రెండు బోన్లను ఏర్పాటు చేశారు.

## బాలుడిపై వీధి కుక్కల దాడి

### మూసారాంబాగ్‌లో ఘటన

మలక్‌పేట, ఏప్రిల్ 28: మూసారాంబాగ్‌లో వీధి కుక్కలు స్వైర విహారం చేశాయి. ఓ బాలుడిని తీవ్రంగా గాయపరిచాయి. లక్ష్మీనగర్‌లోని శ్రీనిధి నిలయం అపార్ట్‌మెంట్ వాచ్‌మెన్‌గా పనిచేస్తున్న సాయికుమార్, అలేఖ్య దంపతుల కుమారుడు ఉజ్జ్వల్‌కుమార్ గేట్ ముందు నిలబడి ఉండగా, ఒక్కసారిగా వచ్చిన కుక్కల గుంపు దాడి చేశాయి. బాలుడి అరుపులు విన్న కుటుంబసభ్యులు, అపార్ట్‌మెంట్ వాసులు వెంటనే వచ్చి కుక్కలను తరిమివేశారు. ఉజ్జ్వల్ తల ముఖానికి, చేతులపై తీవ్ర గాయాలు కావడంతో కుటుంబ సభ్యులు దవాఖానలో చేర్పించి చికిత్స చేయిస్తున్నారు.



## ● ముమ్మరంగా.. ఓటరు స్లిప్‌ల పంపిణీ



సిటీబ్యూరో/మేడ్చల్, ఏప్రిల్ 28 (నమస్తే తెలంగాణ) : పార్లమెంట్ ఎన్నికల్లో ఓటింగ్ శాతం పెంచేందుకు ఎన్నికల విభాగం అధికారులు విస్తృతంగా అవగాహన కార్యక్రమాలు చేపట్టడంతో పాటు ముందస్తుగా ఓటరు స్లిప్‌ల పంపిణీకి చర్యలు చేపట్టారు. స్వీప్ కార్యక్రమంలో భాగంగా ఓటింగ్ శాతం పెంచాలనే లక్ష్యంతో ఇంటింటికీ వెళ్లి పెద్ద ఎత్తున వినూత్నంగా ఓటు హక్కుపై అవగాహన కార్యక్రమాలు చేపడుతున్నారు. మరోవైపు ఓటరు స్లిప్పులను పంపిణీ చేసి, ఓటు హక్కు వినియోగంపై అవగాహన కల్పిస్తున్నారు. హైదరాబాద్, సికింద్రాబాద్ పార్లమెంట్ పరిధిలో 45 లక్షలకు పైగా ఓటర్లు ఉన్నారని, వచ్చే నెల 3వ తేదీ నాటికి ఓటరు స్లిప్‌ల పంపిణీ పూర్తి చేయడమే లక్ష్యంగా బీఎల్‌వోలు, పొదుపు సంఘాల మహిళలు, యూసీడీ విభాగం ఆధ్వర్యంలో కార్యక్రమాన్ని వేగవంతం చేశామని అధికారులు తెలిపారు. కాగా, భారీ సంఖ్యలో ఓటర్లు ఉన్న మల్కాజిగిరి లోక్ సభ పరిధిలోనూ ఓటరు స్లిప్‌ల పంపిణీ వేగవంతంగా కొనసాగుతున్నది.



ఉస్మానియా యూనివర్సిటీ లేడీస్ హాస్టల్ విద్యార్థినులు తాగు నీటి కోసం ఆందోళన బాట పట్టారు. హాస్టల్ ఎదుట ప్రధాన రహదారిపై శనివారం అర్ధరాత్రి రాస్తారోకో చేశారు. ఈ సందర్భంగా పలువురు మాట్లాడుతూ వారం రోజులుగా నీటి సరఫరా లేదని ఫిర్యాదు చేస్తున్నప్పటికీ, అధికారులు స్పందించడం లేదని ఆవేదన వ్యక్తం చేశారు. హాస్టల్‌లో మౌలిక వసతులు కల్పించాలని ఎన్నో రోజులుగా డిమాండ్ చేస్తున్నా.. ఎవరూ పట్టించుకోవడం లేదని వాపోయారు. తక్షణమే కనీస వసతులు కల్పించాలన్నారు.

– ఉస్మానియా యూనివర్సిటీ

# కారును గుర్తుంచుకో..

## మార్నింగ్ వాకర్స్‌తో ఎమ్మెల్యే సబితా ఇంద్రారెడ్డి



బడంగ్‌పేట, ఏప్రిల్ 28:సారు కేసీఆర్‌ను గుర్తు పెట్టుకొని.. కారు గుర్తుకు ఓటు వేసి చేవెళ్ల పార్లమెంట్ ఎంపీ అభ్యర్థి కాసాని జ్ఞానేశ్వర్‌ను గెలిపించాలని ఎమ్మెల్యే సబితా ఇంద్రారెడ్డి వాకర్స్‌కు విజ్ఞప్తి చేశారు. మీర్‌పేట మున్సిపల్ కార్పొరేషన్ పరిధిలోని చందన చెరువు కట్టపై ఆదివారం ఎమ్మెల్యే సబితాఇంద్రారెడ్డి మార్నింగ్ వాకర్స్‌ను ఆప్యాయంగా పలుకరించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. ప్రజా సంక్షేమానికి కట్టుబడి పనిచేసేది బీఆర్‌ఎస్సేనని అన్నారు. హామీల అమల్లో కాంగ్రెస్ సర్కారు విఫలమైందన్నారు. ఓట్లు అడిగేందుకు వచ్చే ఆ పార్టీ నేతలను నిలదీయాలన్నారు. కాంగ్రెస్ అధికారంలోకి వచ్చాక నీటి సమస్య, కరెంటు కష్టాలు మొదలయ్యాయన్నారు. పదేండ్లుగా కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వం తెలంగాణ రాష్ట్రానికి చేసిందేమీ లేదన్నారు. మతం పేరుతో, కులం పేరుతో ప్రజలను మోసం చేయడం తప్ప.. చేసింది శూన్యమన్నారు. దేవుడిని అడ్డం పెట్టుకొని రాజకీయం చేస్తున్నారన్నారు. కార్యక్రమంలో మీర్‌పేట మేయర్ దుర్గా దీప్‌లాల్ చౌహాన్, డిప్యూటీ మేయర్ తీగల విక్రం రెడ్డి, బీఆర్‌ఎస్ పార్టీ అధ్యక్షుడు అర్కల కామేశ్ రెడ్డి, మీర్‌పేట బీఆర్‌ఎస్ పార్టీ వర్కింగ్ ప్రెసిడెంట్ దిండు భూపేశ్ గౌడ్, కార్పొరేటర్లు అర్కల భూపాల్ రెడ్డి, ఏనుగుల అనిల్ కుమార్ యాదవ్ తదితరులు పాల్గొన్నారు.

## హామీల అమల్లో కాంగ్రెస్ విఫలం

### ఎమ్మెల్యే తలసాని శ్రీనివాస్‌యాదవ్

బన్సీలాల్‌పేట, ఏప్రిల్ 28 : ఆరు గ్యారెంటీలంటూ.. అధికారంలోకి వచ్చిన కాంగ్రెస్ హామీల అమల్లో విఫలమైందని, ఇంటింటికీ వెళ్లి.. ప్రభుత్వ వైఫల్యాలను ప్రజలకు వివరించాలని బీఆర్‌ఎస్ శ్రేణులకు ఎమ్మెల్యే తలసాని శ్రీనివాస్ యాదవ్ దిశానిర్దేశం చేశారు. సికింద్రాబాద్ బీఆర్‌ఎస్ ఎంపీ అభ్యర్థి పద్మారావు గౌడ్‌కు మద్దతుగా ఆదివారం మారేడ్‌పల్లిలోని తన నివాసంలో సనత్‌నగర్ నియోజకవర్గం ముఖ్య నాయకులతో డివిజన్ల వారీగా సమావేశాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా సనత్‌నగర్ నియోజకవర్గం ఎన్నికల ఇన్‌చార్జి వెంకట్‌రెడ్డిని పరిచయం చేశారు. అనంతరం తలసాని మాట్లాడుతూ ఎంపీ అభ్యర్థి పద్మారావు ఎక్కడికి వెళ్లినా.. ప్రజలు నీరాజనం పడుతున్నారని, ఆయనకు రోజురోజుకు ప్రజాదరణ పెరుగుతున్నదన్నారు. నాయకులు, కార్యకర్తలు ఇంటింటికీ వెళ్లి.. బీఆర్‌ఎస్ ప్రభుత్వ హయాంలో సనత్‌నగర్ నియోజకవర్గంలో కోట్లాది రూపాయలతో జరిగిన అభివృద్ధి, సంక్షేమ పథకాల గురించి వివరించాలని సూచించారు. లోక్‌సభ ఎన్నికల్లో బీఆర్‌ఎస్ పార్టీని గెలిపించాలని, పద్మారావు గౌడ్ విజయం కోసం నాయకులు, కార్యకర్తలు సమష్టిగా కృషి చేయాలని కోరారు. ఎంపీగా, కేంద్ర మంత్రిగా ఉండి కూడా ప్రజలకు దూరంగా ఉన్న కిషన్‌రెడ్డికి ఓటమి తప్పదన్నారు. ఈ సమావేశంలో బీఆర్‌ఎస్ నాయకులు ధరంరాజ్ చౌదరి, బి.కిరణ్‌కుమార్ గౌడ్, బాల్‌రెడ్డి, శ్రీనివాస్ గౌడ్, కే. లక్ష్మీపతి, శ్రీహరి, హరికృష్ణ తదితరులు పాల్గొన్నారు.



సమావేశంలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే తలసాని

## బీఆర్‌ఎస్ చరిత్రను చెరిపేయలేరు

### హైదరాబాద్ ఎంపీ అభ్యర్థి గడ్డం శ్రీనివాస్ యాదవ్

మలక్‌పేట: సంక్షేమ పథకాల అమల్లో బీఆర్‌ఎస్‌ది ఒక చరిత్ర అని, దానిని ఎవరూ చెరిపేయలేరని హైదరాబాద్ ఎంపీ అభ్యర్థి గడ్డం శ్రీనివాస్ యాదవ్ అన్నారు. ఆదివారం మూసారాంబాగ్‌లోని రజక సంఘ భవనంలో నిర్వహించిన మలక్‌పేట నియోజకవర్గ నాయకుల సమావేశానికి హాజరయ్యారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కలిసి కట్టుగా పనిచేస్తే హైదరాబాద్ ఎంపీ స్థానం బీఆర్‌ఎస్‌దేనన్నారు. దేశంలో ఎక్కడా లేని విధంగా డబుల్ బెడ్రూం ఇండ్లు నిర్మించి ఇచ్చిన ఘనత కేసీఆర్ సర్కారుదేన్నారు. అన్నివర్గాల ప్రజలను అక్కున చేర్చుకొని...గొప్పగొప్ప సంక్షేమ పథకాలు అమలు చేసిన పార్టీ బీఆర్‌ఎస్ అని చెప్పారు. సమావేశంలో బీఆర్‌ఎస్ మలక్‌పేట నియోజకవర్గ ఇన్‌చార్జి తీగల అజిత్‌రెడ్డి, ఎన్నికల ఇన్‌చార్జి ఆజం అలీ తదితరులు పాల్గొన్నారు.



సమావేశంలో మాట్లాడుతున్న హైదరాబాద్ బీఆర్‌ఎస్ ఎంపీ అభ్యర్థి గడ్డం శ్రీనివాస్ యాదవ్

## తాతా..అవ్వా ఆశీర్వదించండి..





బొల్లారంలోని పలు బస్తీల్లో ఆదివారం కంటోన్మెంట్ బీఆర్‌ఎస్ ఎమ్మెల్యే అభ్యర్థి నివేదిత బోర్డు మాజీ సభ్యుడు లోక్‌నాథ్‌తో కలిసి ఎన్నికల ప్రచారాన్ని నిర్వహించి..ఓట్లు అభ్యర్థించారు. వృద్ధులను ఆప్యాయంగా పలుకరించి..వారి ఆశీర్వాదం తీసుకున్నారు. బస్తీ మహిళలు నివేదితకు బొట్టు పెట్టి..మంగళ హారతులతో స్వాగతం పలికారు. అండగా ఉంటామని దీవెనలు అందించారు. ఈ సందర్భంగా నివేదిత మాట్లాడుతూ..కాంగ్రెస్ పాలనలో ప్రజలకు న్యాయం జరగడం లేదని, బీఆర్‌ఎస్‌తోనే కంటోన్మెంట్ నియోజకవర్గం అభివృద్ధి సాధ్యమన్నారు. కార్యక్రమంలో మార్కెట్ కమిటీ మాజీ వైస్ చైర్మన్ వేణు గోపాల్ రెడ్డి, వార్డు ప్రెసిడెంట్ రవికుమార్ తదితరులు పాల్గొన్నారు. – బొల్లారం, ఏప్రిల్ 28

## బీఆర్‌ఎస్‌కు తిరుగులేదు

### ఎమ్మెల్యే దేవిరెడ్డి సుధీర్‌రెడ్డి

ఎల్బీనగర్ , ఏప్రిల్ 28: ఎల్బీనగర్ నియోజకవర్గంలో బీఆర్‌ఎస్‌కు తిరుగులేదని, ఇతర పార్టీలకు స్థానం లేదని ఎమ్మెల్యే దేవిరెడ్డి సుధీర్‌రెడ్డి అన్నారు. మల్కాజిగిరి బీఆర్‌ఎస్ ఎంపీ అభ్యర్థి రాగిడి లక్ష్మారెడ్డితో కలిసి చంపాపేట డివిజన్‌లోని వివిధ ప్రాంతాల్లో పర్యటించి..ఓట్లు అభ్యర్థించారు. రాగిడి లక్ష్మారెడ్డిని భారీ మెజార్టీతో గెలిపించాలని కోరారు. ఎంపీ అభ్యర్థి రాగిడి లక్ష్మారెడ్డి మాట్లాడుతూ.. తనను ఎంపీగా గెలిపిస్తే ప్రధాన సమస్యలను పార్లమెంటులో ప్రస్తావించి..పరిష్కారం చేస్తానని అన్నారు.



చంపాపేట డివిజన్‌లో ప్రచారం చేస్తున్న ఎల్బీనగర్ ఎమ్మెల్యే దేవిరెడ్డి సుధీర్‌రెడ్డి, మల్కాజిగిరి బీఆర్‌ఎస్ ఎంపీ అభ్యర్థి రాగిడి లక్ష్మారెడ్డి తదితరులు

# కరెంటు పోతున్నది.. పంటలు ఎండుతున్నయ్

### సమస్యలు పరిష్కరించాలంటూ.. సీఎం రేవంత్‌కు పోస్టుకార్డులు పంపిన రైతులు



సీఎం రేవంత్‌రెడ్డికి పోస్టు కార్డులు పంపుతున్న రైతులు

మేడ్చల్, ఏప్రిల్ 28 : సమస్యలు పరిష్కరించాలని కోరుతూ రైతులు మూడుచింతపల్లి మండలం కొల్తూర్‌లో ఆదివారం సీఎం రేవంత్ రెడ్డికి పోస్టుకార్డులను పంపారు. ఈ సందర్భంగా డీసీఎంఎస్ వైస్ చైర్మన్ మధుకర్‌రెడ్డి మాట్లాడుతూ కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన కొద్ది కాలంలోనే రైతులను సమస్యలు చుట్టిముట్టాయన్నారు. మాటి మాటికీ కరెంటు పోతున్నదని, బోర్లు కాలిపోతున్నాయని, పంటలు ఎండిపోతున్నాయని, రైతుబంధు రావడం లేదన్నారు. పరిస్థితి ఇలాగే ఉంటే గత సమస్యలు పునరావృతమవుతాయన్నారు. బీఆర్‌ఎస్ ప్రభుత్వ హయాంలో కరెంటు సమస్య తలెత్తలేదని, బోర్లు కాలిపోయి, పంటలు ఎండిపోయిన దాఖలాలు లేవన్నారు. సీఎం రేవంత్‌రెడ్డి స్పందించి, సమస్యలు పరిష్కరించాలని కోరారు. ఈ కార్యక్రమంలో బీఆర్‌ఎస్ మండల అధ్యక్షుడు మల్లేశ్ గౌడ్, కో ఆప్షన్ సభ్యుడు గౌస్ పాష, పీఏసీఎస్ డైరెక్టర్ భిక్షపతి, రైతులు శ్రీకాంత్ రెడ్డి, దయాకర్, అనిల్ రెడ్డి, సంతోష్ రెడ్డి, ఆంజనేయులు, గోపాల్, బావూసింగ్, విష్ణువర్ధన్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

## టీవర్క్స్‌లో వర్క్‌షాప్

సిటీబ్యూరో: భౌతిక ఆవిష్కరణలకు కేంద్రంగా మారిన టీవర్క్స్‌లో ఔత్సాహికులను ప్రోత్సహించేందుకు ప్రత్యేక కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నారు. వేసవి క్యాంపులతో పాటు కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వ రంగ సంస్థలతో కొత్త ఉత్పత్తుల తయారీ విధానంపై వర్క్‌షాపులను ఏర్పాటు చేస్తున్నారు. తాజాగా శనివారం నుంచి హైదరాబాద్, చైన్నై నగరాల్లోని కేంద్ర ప్రభుత్వ రంగ సంస్థ నేషనల్ ఇనిస్టిట్యూట్ ఆఫ్ లెదర్ డిజైన్, ఫ్యాషన్ డిజైన్ సంస్థలతో కొత్త ఉత్పత్తుల తయారీపై అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా స్మార్ట్ వియరబుల్స్‌పై నిపుణులతో శిక్షణనిచ్చారు. పాఠశాల, కళాశాల విద్యార్థులకు టీ వర్క్స్ వేదికగా కొత్త ఉత్పత్తుల డిజైన్‌తో పాటు వాటిని వినూత్నంగా తయారుచేసే అంశాలపై శిక్షణ తరగతులు నిర్వహించారు. పిల్లల కోసం సమ్మర్ క్యాంపును నిర్వహిస్తున్నామని, ఔత్సాహికులు టీ వర్క్స్ వెబ్‌సైట్ ద్వారా సంప్రదించి, పేర్లను నమోదు చేసుకోవాలని నిర్వాహకులు సూచించారు.





## దిష్టి తీసి.. హారతులిచ్చి

### పజ్జన్న పాదయాత్రకు బ్రహ్మరథం

సీతాఫల్‌మండి డివిజన్ పరిధిలోని వివిధ ప్రాంతాల్లో ఆదివారం రాత్రి సికింద్రాబాద్ బీఆర్‌ఎస్ ఎంపీ అభ్యర్థి పద్మారావు గౌడ్ నిర్వహించిన ఎన్నికల ప్రచారానికి ప్రజల నుంచి విశేష స్పందన వచ్చింది. అడుగడుగునా పద్మారావు పాదయాత్రకు బ్రహ్మరథం పట్టారు. మహిళలు దిష్టి తీసి..మంగళ హారతులిచ్చి.. దీవెనలు అందించారు. కారు గుర్తుకే మా ఓటు అంటూ..నినదించారు. ఈ సందర్భంగా పద్మారావు గౌడ్ మాట్లాడుతూ.. తనను గెలిపిస్తే సికింద్రాబాద్ అసెంబ్లీ నియోజకవర్గాన్ని తీర్చిదిద్దిన తరహాలోనే పార్లమెంట్ నియోజకవర్గం అభివృద్ధికి కృషి చేస్తానని చెప్పారు. చిలకలగూడ, లైఫ్‌స్ప్రింగ్ హాస్పిటల్, శ్రీనివాస్ నగర్ కాలనీ, మహమ్మద్ గూడ, షాబాజ్ గూడ, వారసిగూడ, నామాలగుండు తదితర ప్రాంతాల్లో పద్మారావు గౌడ్ ఎన్నికల ప్రచారం సాగింది. ఆయన వెంట స్థానిక కార్పొరేటర్ హేమ, పార్టీ నియోజకవర్గ ఇన్‌చార్జి రాజు సాగర్, యువ నేత రామేశ్వర్ గౌడ్ తదితరులు ఉన్నారు.

- సికింద్రాబాద్

# 3 చోట్ల..ఇంటర్‌చేంజ్ స్టేషన్లు

### మూడు కారిడార్లతో మెట్రో ఎయిర్‌పోర్టు అనుసంధానం

### అనువైన స్థలాల కోసం క్షేత్రస్థాయిలో పరిశీలన

సిటీబ్యూరో, ఏప్రిల్ 28 (నమస్తే తెలంగాణ): విశ్వనగరంగా అభివృద్ధి చెందుతున్న హైదరాబాద్ మహానగరంలో మెరుగైన, ఆధునిక ప్రజా రవాణా వ్యవస్థలను అందుబాటులోకి తీసుకొచ్చేందుకు హైదరాబాద్ మెట్రో రైలు సంస్థ చర్యలు చేపట్టింది. ముఖ్యంగా రెండోదశ మెట్రో ప్రాజెక్టులో భాగంగా చేపట్టిన ఎయిర్‌పోర్టు మార్గాన్ని ఇప్పటికే మొదటి దశలో నిర్మించిన మూడు మెట్రో కారిడార్లను కలుపుతూ నిర్మించేందుకు అధికారులు క్షేత్రస్థాయిలో పర్యటిస్తున్నారు. అలాగే ఇన్నర్ రింగు రోడ్డుపై మూడు చోట్ల ఇంటర్‌చేంజ్ స్టేషన్లను నిర్మించనున్నారు. ఇందుకోసం పట్టణ ట్రాఫిక్ నిపుణులతో ప్రత్యేకంగా సర్వే చేయించి, ఏ సమయంలో ఎక్కడెక్కడ ఎంత ట్రాఫిక్ రద్దీ ఉన్నది. దానికి పరిష్కారంగా ఎలాంటి ఏర్పాట్లు చేయాలన్నదానిపై ఇప్పటికే హైదరాబాద్ మెట్రో అధికారులు సర్వే చేపట్టారు. ఈ అంశాలను పరిగణలోకి తీసుకున్న మెట్రో ఎండీ ఎన్వీఎస్‌రెడ్డి స్వయంగా ఇన్నర్ రింగు రోడ్డు మార్గంలో నాగోల్ నుంచి చాంద్రాయణగుట్ట వరకు 14 కి.మీ నడుచుకుంటూ వెళ్లి.. మెట్రో స్టేషన్లకు అనువైన ప్రాంతాలను గుర్తించారు. ఇందులో భాగంగానే మొదటి దశలో మెట్రో ప్రాజెక్టులో భాగంగా నిర్మించిన మూడు కారిడార్ మియాపూర్-ఎల్బీనగర్( కారిడార్-1), జేబీఎస్-ఫలక్‌నుమా-చాంద్రాయణగుట్ట(కారిడార్-2), నాగోల్-రాయదుర్గం(కారిడార్-3) మెట్రో మార్గాలను కొత్తగా నిర్మించే ఎయిర్‌పోర్టు మెట్రో మార్గానికి అనుసంధానం చేసేందుకు అత్యంత అనుకూలమైన ప్రాంతాలను గుర్తించారు. అలాగే ఇన్నర్ రింగు రోడ్డుపై కొత్తగా నిర్మించాలని ప్రతిపాదించిన ఎయిర్‌పోర్టు మెట్రో మార్గంలో మూడు అత్యంత కీలకమైన జంక్షన్లను గుర్తించారు. వీటిలో నాగోల్ మూసీ నది పక్కన ఉప్పల్‌భగాయత్ లేఅవుట్ దగ్గర ప్రారంభమయ్యే ఎయిర్‌పోర్టు మెట్రో స్టేషన్ అటు ఇప్పటికే ఉన్న నాగోల్ మెట్రో స్టేషన్‌ను కలుపుతుంది. మూసీ నది పొడవునా చేపట్టే ఈస్ట్-వెస్ట్ కారిడార్‌తోనూ కలుస్తుంది. కారిడార్-3 సైతం దీనికి అనుసంధానం అవుతుంది. ఇదిలా ఉంటే, ఎల్బీనగర్ జంక్షన్‌లో ఇప్పటికే కారిడార్-1 మెట్రో మార్గం ఉండటంతో దానికి అనుసంధానం చేస్తూ మరో మెట్రో స్టేషన్‌ను నిర్మించి స్కైవాక్‌లతో రెండు మెట్రో స్టేషన్లను అనుసంధానం చేయనున్నారు. ఇక చాంద్రాయణ గుట్ట వద్ద కలిసే కారిడార్-2తో ఎయిర్‌పోర్టు మెట్రో మార్గాన్ని అనుసంధానం చేసేందుకు అనువైన స్థలాన్ని ఎంపిక చేశారు. శ్రీశైలం హైవే వైపు వెళ్లే చోట ఫ్లై ఓవర్ ఉండటంతో అనువైన స్థలం ఎంపిక సవాలుగా మారిందని, అయినా పలు కోణాల్లో అధ్యయనం చేసి ఇంటర్‌చేంజ్ మెట్రో స్టేషన్‌ను నిర్మిస్తామని అధికారులు పేర్కొంటున్నారు.



**తుప్పపడుతున్న ఆర్టీసీ బస్సులు**

బస్‌భవన్ పక్కన ఉన్న ఖాళీ స్థలంలో ఉంచిన ఆర్టీసీ బస్సులివీ.. ఎండకు ఎండుతూ..వానకు తడుస్తూ..ఇలా తుప్పపడిపోతున్నాయి.